
# బాబోయ్ హైదరాబాద్ నాలుగొందలేళ్ళ ముసల్ది




**హ**ఠాత్తుగా ఏ రాజకీయ నాయకుడి నోట చూసినా "నాలుగొందలేళ్ళ హైదరాబాద్" అన్న పాట వినిపించేసరికి మా కాలనీలో కూడా అందరికీ హుషారు పుట్టుకొచ్చింది. చాలా రోజుల్నుంచీ ఎలాంటి కార్యక్రమాలూ, మీటింగ్‌లూ లేకుండా గాప్ వచ్చేయడం చేత ఆ స్లోగాన్ పట్టుకొని కాలనీ ఆర్గనైజింగ్ సెక్రటరీ శాయిరామ్ విజృంభించేశాడు. వెంటనే కాలనీ వాళ్ళంతా కూడా ఆ మీటింగ్‌కి హాజరయ్యారు.

"మనం కూడా మన కాలనీ తరపున "చార్ సౌ శహర్ హమారా" కల్చరల్ కార్యక్రమం నిర్వహిద్దాం! నలుగురి సంబరంలో పాలుపంచుకుందాం" అన్నాడతను ఆవేశంగా గేయం చదువుతున్నట్లు మాట్లాడుతూ.

పార్వతీదేవికి అతని మాటలేమీ అర్థం కాలేదు.

"హైదరాబాద్‌కి నాలుగొందలేళ్ళు రావటమేమిటి?" అంది అర్థంకాక. మిగతా ఆడాళ్ళు కూడా అదే ప్రశ్న వేశారు.

అందరం ఆమె అజ్ఞానాన్ని చూసి మాలేమేము తృళ్ళి తృళ్ళి నవ్వుకున్నాం.

"మన ఆడవాళ్ళకు కామన్ సెన్సు రావడానికి ఇంకెన్ని వందలేళ్ళు పడుతుందో" అన్నాడు రంగారెడ్డి జాలిగా.

ఆ మాటతో ఆడవాళ్ళందరికీ కోపం ముందుకొచ్చింది.

"మహా మీ మగవాళ్ళకేడ్చిందిలే కామన్ సెన్సు! బోఫోర్సు కుంభకోణంలో ముడుపులు కొట్టేసింది ఎవరూ అనడిగితే నోరు మెదపలేక పోతున్నారు" అంటూ విరుచుకు పడ్డారు.

వాళ్ళతో గొడవెందుకని గోపాల్రావ్ ఎక్స్‌ప్లనేషన్ ఇచ్చాడు.

"అంటే ఉదాహరణకు మీరూ మీ పిల్లలూ ప్రతి సంవత్సరం పుట్టిన రోజులు జరుపుకుంటారు కదా! అలా మన నగరం తాలూకూ నాలుగొందలో సంవత్సరం తాలూకూ బర్త్‌డే అన్నమాట ఇది"

ఆడవాళ్ళందరూ అతి కష్టం మీద నవ్వాపుకున్నారు.

"బ్రహ్మంగారు చెప్పింది నిజమేనేమో! ఈ ఏడు రాజకీయాల్లో ఉన్న వారందరికీ పిచ్చెక్కుతుందని స్పష్టంగా అన్నారటాయన" అంది సావిత్రమ్మ.

"పోనీ వాళ్ళకెక్కిందంటే అర్థం వుంది. మరి మన మగాళ్ళకెందుకెక్కినట్లు?" జానకి అడిగింది.

మాకు వాళ్ళ సంభాషణ వింటూంటే వళ్ళు మండిపోతోంది.

"ఏమ్ సంగతి? దమాక్ లేని మాటలు మాట్లాడుతున్రు? మాకు పిచ్చెక్కినాది?" కోపంగా అడిగాడు యాదగిరి.

''అవును మరి! లేకపోతే ఊరికి పుట్టింన్రోజేమిటి.. ఎవడయినా వింటే నవ్విపోతాడు..." అందామె.

"వీళ్ళ వరస చూస్తుంటే ఆ మూసీనదికీ, నగరం చుట్టూ వున్న కొండలకూ, చెట్లకూ, రాళ్ళకూ, రప్పలకూ కూడా పుట్టిన్రోజు చేసేట్లున్నారు" అంది ఇంకొకావిడ.

"అక్కడితో ఆగితే ఫర్లేదు. ఈ పిచ్చి ముదిరిందంటే రాష్ట్రంలోని అన్ని ఊళ్ళవాళ్ళు పుట్టిన్రోజులు మొదలెడతారు"

"దాంతో మెల్లిగా గూండాలు రంగంలోకి దిగి– పుట్టిన్రోజుల పేరుతో వినాయక చవితిలాగ ప్రతోడూ చందాలు వసూలుచేసి తాగెయ్యటం మొదలుపెడతారు" శాయిరామ్ పరిస్థితి విషమిస్తోందని గ్రహించాడు.

"సోదర సోదరీమణులారా! మన 'చార్ సౌ శహర్ హమరా' కార్యక్రమాన్ని రాష్ట్ర

ప్రభుత్వం పెద్దెత్తున ఎన్నో లక్షలు ఖర్చుచేసి జరుపుతుండటం మీరు చూస్తూనే ఉన్నారు కనుక మన కాలనీ కూడా ఆ సందర్భంగా ఓ అద్భుత సాంస్కృతిక కార్యక్రమం ఏర్పాటు చేస్తే రాజధాని నగర వాసులుగా మనందరికీ ఆనందదాయకంగా వుంటుంది” అన్నాడు మైక్ దగ్గరకు వెళ్ళి.

అతని మాటలు వినేసరికి యాదగిరికి ఆవేశం వచ్చి మైక్ తను లాక్కున్నాడు.

“బరాబర్ చెయ్యాలా! చాల్దినాలకెళ్ళి మన కాలనీ వాళ్ళకు పనీ పాటా జర్రగూడా లేకున్నది. పని లేనోడు ఏంజేసిండు? పిల్లి తలగొరిగిండు? ఎందుగ్గొరిగిండు? చేతిలో పని లేకుండబట్టి. పనిలేకుంటే ఏం చేస్తాడు మల్లా? బరాబరా పిల్లి తల గొరుగుతాడు. గొరగడా మళ్ళా? నువ్వు గొరగవా? ఇది జమానాల ముచ్చట! మరి ఈ దినం ముచ్చటేమి? పని లేనోండ్లు ఏదొక దందాజెయ్యాల! ఏం దందా జెయ్యాల? దినం దినం నయా నయా దందాలు ఏడి కెల్లోస్తాయ్? గందుకే ఈ చార్ సౌ శహర్ నికలాయించిన్రు! దీన్దిక్కుకెళ్ళి జబర్దస్ దందాలు నడిపించానికి సౌలతున్నది ఏం జెప్తున్నా!”

“అవును! మనం గూడా ‘చార్ సౌ’ ఘుమాయించాలె” వెనుక వరుసలో నిలబడ్డ స్టూడెంట్స్ అరిచారు.

దాంతో కొంతమంది సైలెంటయిపోయారుగానీ మిగతావాళ్ళు ఇంకా గొణుగుతూనే ఉన్నారు– ముఖ్యంగా ఆడవాళ్ళు. ఈలోగా జనార్ధన్ మైక్ ముందుకొచ్చాడు.

“సోదర సోదరీమణులారా! నేను ప్రముఖ సినీ నటుడినని ఈ నగరంలో చిన్న పిల్లలకు కూడా తెలుసు” అన్నాడు చిరునవ్వుతో ఓసారి జనాన్ని ‘ప్యాన్’చేసి చూసి…

వెనుక నుంచి స్టూడెంట్స్ కేకలు వినిపించినయ్.

“బస్‌కరో భాయ్! బస్‌కరో”

“చార్ సౌ” కార్యక్రమాలు నిర్వహించాలని మన కాలనీవాళ్ళు ఏక కంఠంతో పట్టుబట్టడం చూస్తుంటే నాకు ఎంతో ఆనందంగా ఉంది.

ఎంతో కాలం తర్వాత మన కాలనీలో ఒకే కంఠం వినబడుతోంది. ఈ సందర్భంగా కాలనీ తరపున నాలుగొందలేళ్ళ నగరం మీద ఒక వీడియో ఫిలిం తీయాలని నాకు కోరికగా ఉంది. అందులో మన కాలనీ వాళ్ళందరూ కనబడేలా తీస్తే అప్పుడు ఆ ఫిలిం దూరదర్శన్ ద్వారా టెలీకాస్ట్ చేయిద్దాం! ఆ విధంగా మన కాలనీలో ప్రతి ఒక్కరూ దూరదర్శన్‌లో కనిపించే అవకాశం కలుగుతుంది.”

జనార్ధన్ మాటలు అక్కడున్న వారందరికీ ఒక్కసారిగా మైకం కలిగించాయి.

“కానీ… అలామనం ఏది షూటింగ్ చేసిస్తే అది దూరదర్శన్ వాళ్ళు ప్రసారం చేస్తారా?” అనుమానంగా అడిగింది పార్వతీదేవి.

"భలే ప్రశ్న అడిగారు! మన దూరదర్శన్ గురించి మీరు మరీ తక్కువగా అంచనా వేస్తున్నారు? కేవలం పందులూ, పక్షులూ, బట్టవన్నె మేక పిట్టలూ, దున్నపోతులూ వాటికి వీర్య వృద్ధి కలిగించే చిట్కాలు.. ఇవే దూరదర్శన్‌వారు ప్రసారం చేస్తారని మీరనుకుంటే మీరంతా పొరపాటు పడ్డట్లే! ఈ రోజున దూరదర్శన్ రాష్ట్రంలో ప్రతి పౌరుడికీ ఒక్కసారయినా తనను తాను టీవీలో చూసుకునే అవకాశం కల్పిస్తోంది. ఇంత అద్భుతమయిన ప్రక్రియ కేవలం మన దేశంలోనే ప్రప్రథమంగా ప్రారంభించారని నేను మనవి చేస్తున్నాను. మన ప్రజలందరూ కూడా గొర్రెలకు ఏమాత్రం తీసిపోరని మన దూరదర్శన్ అధికారులు ఈ రోజున గమనించారు. అదీగాక 'చార్ సౌ' అనే కార్యక్రమం మీద ఏ అడ్డమయిన చెత్త అయినా సరే ప్రసారం కావాలని వారికి స్పష్టమయిన ఆదేశాలు ఇచ్చారు." హఠాత్తుగా చప్పట్లు మార్మోగిపోయినయ్.

అప్పటికప్పుడే 'నాలుగొందలేళ్ళ అందమయిన సుందర నగరోత్సవం" అనే పేరుతో అద్భుతమయిన కార్యక్రమం ఏర్పాటు చేయాలన్న నిర్ణయం జరిగిపోయింది. ఆ రోజు రానే వచ్చేసింది.

కాలనీ జనమంతా వేదిక దగ్గర ముందు నుంచే గుమిగూడిపోయారు.

శాయిరామ్ తను దీపావళి కోసం కుట్టించుకున్న కలర్‌ఫుల్ కాస్ట్యూమ్స్ వేసుకుని మైక్ ముందుకొచ్చేశాడు.

"సోదర సోదరీమణులారా! ఇవాళ నిజంగా గొప్పరోజు! ఎందుకంటే ఇవాళ నిన్న కాదు! నిన్న రేపు కాదు కనుక! ఏనాటి నాలుగొందలేళ్ళ నగరమిది? ఎంత సుందరమయిన భాగ్యనగరమిది?" అంటూ కవిత్వం ధోరణిలోకి దిగగానే జనం అరుపులు మొదలెట్టారు.

"ఇక చాల్లే- ఆపు!"

సరిగ్గా అప్పుడే మంత్రిగారు వేదికకకు సమీపంలో కారు దిగారు. ఆయనతోపాటు మున్సిపల్ చైర్మెన్, పోలీస్ అధికారులు-

రంగారెడ్డి వెంటనే పూలదండ తీసుకెళ్ళి మినిస్టర్‌గారి మెడలో వేశాడు.

అంతా తప్పట్లు మారుమ్రోగిపోయినయ్.

అందరూ వేదిక మీదకెళ్ళారు.

కార్యక్రమం ప్రారంభమైంది.

మినిష్టర్‌గారు లేచి మైక్ ముందుకొచ్చారు.

"సోదర సోదరీమణులార! నిజంగా. ఈ భాగ్యనగరానికి నాలుగొందలేళ్ళొచ్చాయంటే నాకెంత ఆనందంగా వుందో చెప్పలేను. మా తాత వంద సంవత్సరాలు బ్రతికినప్పుడు కూడా నేనింత ఆనందించలేదు-"

"తెలుసులే- తాత ఇంకా బ్రతికుతే తిండి పెట్టాల్సి వస్తుందని ఆనందించలే" ఎవరో స్టూడెంట్స్ అరిచారు.

రంగారెడ్డి వారివైపు కోపంగా చూశాడు.

"సైలెన్స్" అన్నాడు గట్టిగా.

వాళ్ళు సైలెన్స్ అయిపోయారు.

"మన నగరానికి భాగ్యనగరమనే పేరెలా వచ్చిందో మీకందరికీ తెలుసు. మొహమ్మది కులీ అనే గొప్ప మహారాజు భాగ్‌మతీ అనే బీదింటి అమ్మాయిని ప్రేమించి పెళ్ళిచేసు కున్నాడు. అందుకే ఈ నగరానికి భాగ్యనగరం అనే పేరు వచ్చింది"

"అష్టా-అభష్టం' అన్న గావుకేక జనంలోనుంచి వినిపించేసరికి అందరం ఉలిక్కిపడి చూశాం.

మధ్యనుంచి యాదగిరి లేచి నిలబడ్డాడు. యాదగిరితోపాటు జనార్ధన్‌కూడా లేవడానికి ప్రయత్నించి తూలిపడబోయి నిలదొక్కుకున్నాడు. ఇద్దరూ ఒకరినొకరు ఆసరాగా తీసుకొని వేదిక దగ్గరకు నడిచారు. వాళ్ళను ఆపటానికి నేనూ, రంగారెడ్డి హడావుడిగా పరుగెత్తాం గానీ వాళ్ళు ఒక్క మాట మాట్లాడి దిగిపోతామని ప్రామిస్ చెయ్యడంతో ఊరుకోవాల్సి వచ్చింది.

యాదగిరి వేదిక ఎక్కి తూలిపడకుండా మైక్‌ని పట్టుకున్నాడు. "మినిష్టర్ సాబ్ భాగ్యనగరం గురించి గలత్ జెప్పిన్రు! ఎందుకంటే ఇస్లామ్ నాలుగో ఖలీఫ్ లేడా? గా పెద్దమడిసికొక బిరుదున్నది. ఆ బిరుదు మీకెరుకనా? 'హజ్రత్ అలీ'! అగో! ఆ హజ్రత్ అలీ పేరు దిక్కుకెళ్ళి ఈ సిటీకి హైదరాబాద్ అన్న పేరు అచ్చింది నామాట కరెక్ట్ కాదని ఎవడ్నయినా జెప్పమను- చెప్పుతోటి కొడతా!"

మినిష్టర్ ముఖంలో రంగులు మారినయ్

"సోదరీ సోదరీమణులారా! ఇతను చెప్పినట్లు అది కూడా నిజమే అయుండవచ్చు. అదంతా చరిత్రకారులకు సంబంధించిన విషయం గనుక నేను ఆ టాపిక్ వదిలేస్తున్నాను" అన్నాడతను.

వెంటనే యాదగిరిని వేదిక దింపేశాము మేము.

మినిష్టర్ మళ్ళీ ఉపన్యాసం ప్రారంభించాడు.

"సోదరులారా! భాగ్యనగరం గురించి చెప్పాలంటే మాటలు రావటం లేదు. ఈ నగరంలోకి ఎవరు వచ్చినా ఆరోగ్యైశ్వర్యాలతో తులతూగేవారు ఈ నగరంలోని ప్రజలు నాలుగొందలేళ్ళనుంచి అద్భుతమయిన, ఆనందకరమైన జీవితం గడిపారు. ఇక్కడ భూకంపాలులేవు, వరదలు లేవు"

"అష్హా అభష్షం" మళ్ళీ అరిచాడు యాదగిరి.

మేము వాళ్ళకి అడ్డుపడే లోపలే యాదగిరి, జనార్ధన్ మళ్ళీ మైక్ దగ్గరకొచ్చారు.

"భాయియో! బెహనో! మినిస్టర్ సాబ్ మళ్ళా గలత్ మాట్లాడిండు. హైదరాబాద్ గొప్ప నగరం అని మినిస్టర్ అన్నాడుగాని సచ్ చెప్పాల్నంటే ఇది ఫాల్తూ సిటీ! 1908 సంవత్సరం వరకూ ఈడ ఎన్ని సార్లు వరదలు వచ్చినయో? ఎంతమంది పబ్లిగ్గా చనిపోయిన్రో మినిస్టర్ సాబ్‌కి ఎరుకలేదు. అంతెందుకు భాయ్! నిన్నగాక మొన్నటి నెలలో మూసీ సడెన్‌గా నదిలోనికెళ్ళి వర్షం నీళ్ళు ఛుతాయించిన్రు. యాదున్నదా? అప్పుడేమాయె? ఆడ బట్టలుతుక్కు నేటోళ్ళు ఆ వరదలో బడి చచ్చిన్రు! మరి మినిస్టర్ సాబ్ గట్ల మాట్లాడతాడేమి? తాగివున్నాడా?"

గోపాల్రావు వాళ్ళిద్దర్నీ బలవంతంగా మళ్ళీ వేదిక దించాడు.

"సోదర సోదరీమణులారా! ఆ మిత్రులిద్దరూ కొంచెం మందుకొట్టి ఉండడంటవల్ల అతిగా మాట్లాడుతున్నారు. వారి మాటలు పట్టించుకోవద్దని అందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను"

అప్పుడే గుప్‌మని మురుగువాసన ఆ ప్రాంతమంతా ఆవహించేసరికి అందరూ గాబరాగా ముక్కులు మూసేసుకున్నారు.

"ఏమిటా వాసన?" తనూ ముక్కు మూసుకొంటూ అడిగాడు మినిస్టర్.

"అది మామూలే సార్! మెయిన్ రోడ్డుమీద డ్రయినేజ్ చోక్ అయి మురుగు రోడ్డంతా ప్రవహిస్తుంటుంది" చెప్పాడు రంగారెడ్డి.

మినిస్టర్ తేలికగా గాలి పీల్చుకున్నాడు "ఓశ్! అంతేనా?" అన్నాడు సంతృప్తిగా.

"కనక సోదర సోదరీమణులారా! అందమైన మన సుందరనగరానికి నాలుగొందలేళ్ళు నిండిన సందర్భంలో మనల్ని మనం అభినందించుకోవటం ఎంతో అవసరం. ఎందుకంటే విభిన్న భాషలున్నా, విభిన్న మతాలున్నా, అద్భుతమైన మత సామరస్యంతో మెలిగిన నగరమిది. మతసామరస్యం అనేది నాలుగువందల ఏళ్ళనుంచీ ప్రజలు ఈ నగరంలో పాటించటం నిజంగా ఒక గీటురాయి– కలికితురాయి, శాంతి హృదయాలకు పరాకాష్ట"

హఠాత్‌గా యాదగిరి, జనార్ధన్ మళ్ళీ మైక్ ముందుకొచ్చారు.

"అగు– అదిభీ గలత్ మాటనే! ఈ సిటీల జరిగినన్ని ఫాల్తూ దందాలు, ఈడ జరిగినన్ని మారణహోమాలు ఇంకే సిటీలోనూ జరగలే! ఈడ హిందువులు జనాభా ఆ జమానలోనే అరవైశాతం వుండెడిది. ఐనా గానీ ఈడ ప్రజలు ఏ జబాన్‌ల మాట్లాడిన్రు? ఉర్దూలోనే నిజాం కార్‌బాయ్ నడుస్తుండే! మరీడ మెజారిటీ రూలేదున్నది వయ్యా?

అదిడిసెయ్! ఈ మినిస్టర్ సాబ్ జెపుతుండు ఈడ మతసామరస్యం జబర్దస్త్‌గా

ఉండెడిదని! ఈయన కేమైనా దమాకున్నదా? ఈడ జరిగినన్ని మతకల్లోలాలు దేశంలో ఏడా జరగలే! గిసంటి స్టేట్‌మెంట్లిచ్చే సాలేగాండ్లు న్యూస్‌పేపర్ జదవరా? హిస్టిరి కితాబ్‌లు జదవరా? నీయవ్వ పోలీస్ యాక్షన్ ముందే గదవయ్యా రజాకార్లు హిందువులందర్నీ ఎతికి ఎతికి చంపబోయిన్రు! ఆడకెళ్ళి మతకల్లోలాల్లో ఎంతమంది సచిన్రో పోలీస్ రికార్డులులెవ్వా? బైగన్‌కీ మత సామరస్యం ఏడున్నదివయ్యా? మా చెల్లెలు ఆమె భర్తా ఓల్డు సిటీలో ఉంటుండె! కమ్యూనల్ గూండాలు ఆళ్ళను సంపి ఇల్లు తగలబెట్టనికి కోషిస్ చేస్తుంటే ఆళ్ళు ఓల్డుసిటీ ఇడిసిపెట్టి న్యూ సిటీకి ఉరికి వచ్చిన్రు! వాళ్ళ ఇల్లూపాయె, ఇంటిలో సామానూపాయె! గిసంటి కమ్యూనల్ రైట్స్‌ని ఈ రాజకీయ లీడర్‌లే శురూ జేయించి– సచ్చేటోడు సచ్చినాక" చార్ సౌ శహర్ దందాలు శురూ జేస్తున్రు!"

ఇంక లాభం లేదని యాదగిరిని అందరం లాక్కెళ్ళటానికి ప్రయత్నించాం.

కానీ యాదగిరి మళ్ళీ ఒక విదలింపుతో మమ్మల్ని వదిలించుకొని మైక్ దగ్గరకి పరుగెత్తాడు.

"మతసామరస్యం ఏడున్నదివయ్యా– మతసామరస్యం ఇడిసిపెట్టు! ప్రాంతీయ సామరస్యమే లేదాయె! గిసంటి హిస్టరీ ఉన్న ఫాల్తూసిటీని చార్ సౌ శహర్ హమరా అని శరమ్ లేకుండా షాన్‌తోటి ఫంక్షన్స్ జేస్తున్రు"

జనమంతా యాదగిరి స్పీచ్‌కి తప్పట్లు కొట్టడంతో మినిస్టర్‌గారి మొహం పాలిపోయింది. "యాదగిరి సచ్చా, మినిస్టర్ జూటా" అంటూ అరిచారు స్టూడెంట్స్. తమాషా ఏమిటంటే మాకు తెలీకుండానే మేమూ తప్పట్లు కొట్టేశాం.

కొద్ది క్షణాల తర్వాత రంగారెడ్డి మేలుకొని యాదగిరిని మైక్ ముందు నుంచి పక్కకు లాగేశాడు.

మినిస్టర్ మళ్ళీ స్పీచ్ ప్రారంభించాడు.

"ఆ వ్యక్తి ఏవో కొన్ని చిన్న చిన్న అల్లర్ల గురించి మాట్లాడుతున్నాడు. కనుక మనం వాటిని పట్టించుకోనక్కర్లేదు– మన నాలుగొందలేళ్ళ మహానగరానికి స్త్రీలను గౌరవించే సాంప్రదాయం ఆనాది నుంచీ ఉందనీ మరే నగరంలో కూడా స్త్రీలకు ఇంతటి స్వేచ్ఛా స్వాతంత్రాలు లేవనీ నేను సవినయంగా మనవి చేస్తున్నాను. టావెర్నియర్, థివెనాట్, బెర్నియర్ అనే ఫ్రెంచ్ యాత్రికులు పదిహేడవ శతాబ్దంలో ఈనగరాన్ని సందర్శించి ఆ రోజుల్లో స్త్రీలకు వివాహ సమయంలో భర్త ఒక ప్రామిస్ చేయాల్సి వచ్చేదని రాశాడు. ఆ ప్రామిస్ ఏమిటంటే స్త్రీకి ఎక్కడయినా తిరిగే స్వేచ్ఛను ఇస్తానని, ఆమె కల్లు తాగటానికి కూడా అనుమతి ఇస్తాననీ అందరి ముందూ చెప్పేవాడన్నమాట– స్త్రీకి ఇంతటి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఉన్న నగరం మన చార్ సౌ శహర్ హమారా!"

యాదగిరి జనార్దన్ పగలబడి నవ్వారు హేళనగా. మేము వారిని నిశ్శబ్దంగా ఉండ మని కోరడానికి ప్రయత్నించాం గానీ జనమంతా అతనిని మాట్లాడనివ్వాలని గొడవ చేయడంతో వెనక్కు తగ్గక తప్పలేదు.

యాదగిరి మళ్ళీ మైక్ అందుకున్నాడు.

"అహ్హా! చార్ సౌ శహర్ హమారా!! మినిష్టర్ సాబ్ జెప్పిందు ఆ ఫ్రెంచోళ్ళు ఎవళ్ళో పదిహేడు శతాబ్దంల 'లేడీస్'కి ఎంత ఇజ్జత్, ఎంత ఆజాది ఉన్నాది రాసిన్రని! కానీ మినిష్టర్ సాబ్ ఆళ్ళు రాసింది పూరా సదవలేదన్నట్లు! ఆ జమానాల హైదరాబాద్ నగరంల ఇరవైవేల మంచి వ్యభిచారిణులుండె! అది గూడా ఆళ్ళేరాసిన్రు! అది మినిష్టర్ సాబ్ కెరుకలే! పోనీ, అదిడిసి పెట్టండ్రి! హైదరాబాద్ కెళ్ళి పెండ్లికాని పోరీలను అరబ్ దేశాలకు ఎక్స్‌పోర్ట్ చేసెడిదందా గురించి మినిష్టర్ సాబ్ ఏం జెప్తడు? దినాం న్యూస్‌పేపర్‌ల జదువుతూనే ఉన్నాం! ఓల్డ్ సిటీల ఎనిమిదేండ్ల పోరీలను దెబ్బయ్ ఏండ్ల ముసలిబాడుకవ్‌లు పైసలిచ్చి అరబ్ దేశాలకు తీస్కపోతున్రు! ఒక్కొక్కనికి ఇద్దరు ముగ్గురు పెండ్లాలుండిన నగరం కూడా ఈ చార్ సౌ బీస్ నగరమేనన్న సంగతి మీకు భీ ఎరుక!"

మళ్ళీ తప్పట్లు మార్మోగిపోయినయ్.

"మినిష్టర్ వాపస్‌జావ్- యాదగిరి స్పీచ్‌దేవ్" అని అరవటం ప్రారంభించారు స్టూడెంట్స్!

మినిష్టర్‌కి కూడా చిరాకు పుట్టుకొచ్చింది.

"నేనిక మాట్లాడదల్చుకోలేదు. మన నగరాన్ని మనందరం కలసి పొగడాలని ప్రభుత్వం హైలెవల్లో డెసిషన్ తీసుకుంది. కనుక మనం పొగడక తప్పదు. నగరం మీలో ఎవరికయినా నచ్చకపోతే సైలెంట్‌గా ఉండాలిగానీ ఇలా నిజాలు బయట పెట్టకూడదు. మన జాతీయ గీతం కంపల్సరీ చేసినట్లు, చార్ సౌ శహర్ హైదరాబాద్‌ని పొగుడుతూ కూడా ఓ గీతం తయారు చేయించి అన్ని ఫంక్షన్స్‌కి కంపల్సరీ చేయాలని నేను ముఖ్యమంత్రిగారికి సూచన చేయదల్చుకున్నాను-" అనేసి కుర్చీలో కూర్చున్నాడు కోపంగా.

శాయీరామ్ అదే అవకాశం అని మైక్ అందుకున్నాడు.

నాలుగొందలేళ్ల నగరం- నాలుగొందలేళ్ల వైభవం!

నాలుగొందలేళ్ళ నగరం- నాలుగొందేళ్ళ తరం తరం

ఇప్పుడు కార్యక్రమంలో తరువాతి అంశం మన మునిసిపల్ చైర్మెన్‌గారు నాలుగొందేలేళ్ళ సుందర నగరం అనే అంశం గురించి మాట్లాడతారు" అనగానే చైర్మన్ లేచి మైక్ ముందుకొచ్చాడు.

"సోదరీ సోదరీమణులారా! నిజంగా మనది అందమయిన నగరం సుందరమయిన

నగరం. ఈడున్నన్ని సౌలత్‌లు పూరా దునియాల ఏడచూసినాగానీ లేవన్నట్లు! నా ఈ స్పీచ్ షురూ జేసెడి ముందు మన సుందర నగరం లోపటున్న మెయిన్‌రోడ్ డ్రైనేజ్ గోతుల్లోపట స్కూటర్లతో సహాపడి చచ్చినోండ్ల గురించి జరమౌనంగా ఉండి సంతాపం పాటించాలె!

అందరం లేచి డ్రైనేజీ విక్టిమ్స్ గురించి మౌనం పాటించాం!

చైర్మెన్ మళ్ళీ స్పీచ్ మొదలుపెట్టాడు.

"గిప్పుడు స్పీడ్ బ్రేకర్లకు, రోడ్డు డివైడర్లకు తలిగి రోడ్‌మీదపడీ గోతుల్లోపడి చీకట్లో కొట్టుకొని చచ్చినోండ్ల గురించి రెండు నిమిషాలు సంతాపం చూపాలి–"

అందరూ మరోసారి నిశ్శబ్దం పాటించారు.

"గిప్పుడు మన సుందరమయిన నగరంల ఇండస్ట్రియల్ పొల్యూషన్ దిక్కుకెళ్ళి సచ్చినోండ్ల గురించి సంతాపం పాటించాలె!"

అందరూ మరోసారి నిశ్శబ్దం పాటించారు.

"గిప్పుడు మన కార్పొరేషన్ సప్లయ్ చేసే మంచినీళ్ళల్లో డ్రైనేజీ వాటర్ కలిసినప్పుడు చచ్చినోళ్ళ ఆత్మశాంతికి ఇంకో రెండు నిమిషాలు మౌనం"

మళ్ళీ అందరం లేచి రెండు నిమిషాలు మౌనంగా పాటించాం.

"గిప్పుడు పోలీసోండ్లు నగ్జలైట్స్‌ని కాల్చబోతే గల్తీల గోలీలు తగిలి చచ్చిన పబ్లిక్ గురించి రెండు నిమిషాలు మౌనం నడిపించాలె!"

మళ్ళీ రెండు నిమిషాలయింది.

"సోదర సోదరీమణులారా! గిసంటి అందమయిన నగరానికి నాలుగొందలేళ్ళొచ్చి నంక మనం ఖామోషుండానికి ఏడకెళ్ళవుతది? ధూమ్‌మచాయించాలె! ధూమ్‌మచాయించాల్నంటే పైసలుగావలె! పైసలేడికెళ్ళొస్తయ్! గవర్నమెంట్ కెళ్లిరావాలె! మన నగరంలో అన్నీ మంచిగున్నయ్. కులీ కుతుబ్‌షా సాబ్ మంచిగ అన్నీ సోంచాయించి ఈ నగరం కట్టిండు!"

అతని మాట పూర్తికాకుండానే 'తూనీయవ్వ' అంటూ అరచి లేచి మైక్ ముందుకొచ్చారు యాదగిరి జనార్ధన్‌లు.

"భాయియో, బెహనో! మన చార్ సౌ బీచ్ శహర్‌ని నాలుగొందలేళ్ళకు ముంగట సిర్ఫ్ నాలుగు లక్షల జనాబా గురించి ప్లాన్ ఇచ్చిన్రు! కాని ఈ దినం మన శహర్ జనాభా ఎంత? నీయవ్వ– యాభై లక్షలు! అయినాగానీ ఆ నాలుగు లక్షల జనాభాకున్న సౌలత్‌లోనే యాభైలక్షల మందిగ్గూడ నడిపిస్తున్రు! అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ గందుకే రోడ్లమీదకెళ్ళి బహాయిస్తున్నది. నాల్గుదినాలు గట్టిగ ఎండలొస్తే తాగనికి నీళ్ళుండయ్,

బోర్‌వేల్ నీళ్ళు తాగుదాం అంటే ఇండస్ట్రీల పొల్యూషన్ తోటి ఖరాబయిపోయె! ఇంక రోడ్లు జూస్తే పాకిస్తాన్ మిలటరీ వాండ్లు హైదరాబాద్ మీద దాడిజేస్తే వాండ్ల ఆ రోడ్ల మీదే ఖతమ్ గావాల్నన్నట్లుంటయ్. రోడ్లు మన దుష్మన్‌ల కోసం వేసినట్లు వేసిన్రు!"

"శభాష్ బిడ్డ! నడవనీ" తూలిపోతూ అరచాడు జనార్ధన్ మధ్యలో.

అంతా తప్పట్లు– కొంతమంది మినిస్టర్ సాబ్ కేయాల్సిన దండలు తెచ్చి యాదగిరి మెడలో వేశారు. మేమందరం యాదగిరికి మళ్ళీ నచ్చజెప్పిమైక్ నుంచి తప్పించాం.

చైర్మెన్ మాడిపోయిన మొఖంతో మైక్‌లో మాట్లాడాడు.

"ఈ కాలనీ కమిటీ ఓళ్ళెవరోగాని గిసంటి ఫాల్తూ మాటలు మాటాడేటోళ్ళను నజ్ దిక్ రానీకుండ జూడాలె!"

ఆ మాట అనగానో టమాటోలు ఎగిరివచ్చి స్టేజిమీద పడినయ్.

దాంతో మేము వేదిక ఎక్కక తప్పలేదు.

"సోదరీ సోదరీమణులారా! అతిథుల మీదకు టమాటోలు, కోడిగుడ్లు విసిరే సంప్రాదాయం మంచిదికాదని ఈ కాలనీ ఆర్గనైజింగ్ సెక్రటరీనయిన శాయిరామ్ అనే నేను అందరికీ సవియనంగా మనవి జేస్తున్నాను.

"అయితే ఆ మినిష్టర్‌ని, చైర్మన్‌నీ మైక్ దగ్గరకు రానీద్దు" అరచారు వెనుకనుంచి.

"మీ అందరి కోరిక ప్రకారం కార్యక్రమంలో తరువాతి అంశం– మన కాలనీ గేయకవి, రచయిత అయిన చంద్రకాంత్ ఛటోపాధ్యాయ్ గారు తను ప్రత్యేంగా రాసిన గేయాలు చదువుతారు–

అంతా తప్పట్లు మార్మోగిపోయినయ్ చంద్రకాంత్ మైక్ ముందు కొచ్చాడు.

"అహా నాలుగొందలేళ్ళ నగరం!

ఓహెూ చార్‌సౌబీస్ నగరం!

అటు చూస్తే నాల్గుగంటల ట్రాఫిక్ జామ్

ఇటు చూస్తే ట్రాఫిక్ రూల్స్‌లేని

లారీల మధ్య మనం గులాబ్‌జామ్.


ఈ డ్రయినేజ్ గోతి వయసు నాలుగొందలేళ్ళు

ఈ కర్ఫ్యూ బ్రతుకు భయం వయసు నాలుగొందలేళ్ళు. రోజంతా కార్పొరేషన్ మురికి రాత్రికి ఫ్యాక్టరీల పొల్యూషన్ ఊపిరి

నగరం నడిబొడ్డులో మురికి కూపాల 'సాగర్'లు–

నగరం శివారల్లలో బందిపోట్ల 'డేగర్'లు –

జనమంతా ఈలలు, కేకలు, తప్పట్లతో ఆనందంగా మొదటి చరణం కలసిపాడారు.




ఆహా నాలుగొందలేళ్ళు నగరం -

ఓహో చార్ సౌ బీస్ నగరం -

యాదగిరి హఠాత్తుగా మైక్ ముందుకొచ్చాడు.

"భాయియో, బెహనో, ఈ చార్ సౌ శహర్' ఉత్సవాలు ఎందుకు తీసిన్రో నాకెరుక! మీకెరుకనా?" అడిగాడు.

"తెలుసు- తెలుసు" అరిచారందరూ.

"తెలుస్తే జెప్పండి మళ్ళా!"

"ఈ ఉత్సవాల పేరుతోటి ప్రభుత్వం పైసలు తిననికి" అరచాడొకతను.

"సెంటర్లో కూడా దూరదర్శన్ వాళ్ళు 'నాలుగొందలేళ్ళ హైదరాబాద్ నగరం గురించి ఫిల్మ్ తీయమని లక్షల రూపాయలు ప్రైవేట్ పార్టీలకిచ్చారు. రాష్ట్రంలో లక్షల రూపాయలు ఉత్సవాలకు ఖర్చు చేస్తున్నారు. కానీ ప్రజలకు కనీస సౌకర్యాలు లేక మురిగి పోతున్న నగరానికి ఒక్క పైసా కూడా ఎవడూ ఖర్చుచేయటం లేదు- థూ నీయవ్వ" అరచాడు జనార్ధన్.

దాంతో ఇంక భరించలేక మినిష్టరూ, చైర్మనూ లేచి కోపంగా కారువేపు వెళ్ళిపోయారు.

మర్నాడు దూరదర్శన్‌లో మా కాలనీ ప్రోగ్రాం చాలా ఘనంగా చూపించారు. ఎటొచ్చీ యాదగిరి, జనార్ధన్, మిగతా కాలనీ వాళ్ళ స్పీచ్‌లు మాత్రం లేవు. కేవలం మినిష్టరూ, చైర్మెన్ నాలొగొందలేళ్ళ హైదరాబాద్ గురించి పొగడటం కన్పించింది.